# "సారూ...! నా గురించో కథ రాయవా?

-కాలువ మల్లయ్య

దొడ్డు ధోతీ... చిరుగులు పడ్డ అంగీ... చెవులను, తలను కప్పుతూ కట్టిన పంచె... మాసిన గడ్డం... లోతుకు పోతున్న కండ్లు... పనితో సాగబారిన శరీరం... చలికి పగిలి తెల్లగా పాలిపోతున్న కాళ్ళు చేతులు... ఒక చేతిలో పాల డబ్బా... మరో చేతిలో అరలీటరు పావు...

పాలు పోసి నిల్చున్నాడు కిష్టయ్య...

రుడక కుర్చీలో కూర్చొని వార్తాపత్రిక తిరగేస్తున్న వినూతన్ దిక్కే చూస్తున్నాడు... కొద్దిసేపాగి "సారూ... ఓ సారూ...!" పిలిచాడు.

ఆ పిలుపు విని పేపర్లోంచి ముఖం బయటపెట్టాడు వినూతన్... "ఏంటి కిష్టయ్యా...! ఏదో చెప్పడానికి వెనుకాడుతున్నావు... ఏం కావాలో చెప్పు..." అన్నాడు.

"చెప్పుమంటరా సార్..."

"చెప్పుమనే కదా నేననేది...'

"మీరు కథలు రాస్తున్నారట నిజమేనా...?"

పేపరు కింద పడేశాడు వినూతన్...

"అవును... అయితేంటి...?"

"మీరేమనుకోనంటే ఒక్క మాట..."

"చెప్పు..."

"నా గురించో కథ రాయరా...?"

కిష్టయ్య మాటలకు నోరు తెరిచాడు వినూతన్...

అతనిపై కోపం కూడా వస్తుంది... కొద్దిసేపేం మాట్లాడలేదు...

"నీ గురించి కథ రాయాలా?" అన్నాడు ఆశ్చ ర్యంగా.

"మీది, మాది ఒక ఊరు కదా సార్...! మీరు చదువుకొని ఉద్యోగం చేస్తున్నరు...? పట్నంలో ఉంటున్నరు... నేను ఊళ్ళనే ఉండి వ్యవసాయం చేసు కుంటున్న... నాలుగు బర్లున్నయి... నా గురించి మీకు తెలుసు కద..."

"మనది ఒకే ఊరయినంత మాత్రాన నీ గురించి కథ రాయనా! అసలు నువ్వేంటి? నీ మీద కథ రాయ డానికి నీ దగ్గరేముంది? నీ గురించి కథ రాయడమేంటి కిష్టయ్యా? నువ్వేమన్న రాజువా...? నాయకుడివా...? గొప్ప వాడివా...? నువ్వేం చేసావని నీ గురించి రాయడం...? నీకేం నైపుణ్యముంది...?"

సూటిగా ప్రశ్నించాడు వినూతన్...

"నేనేంటి...? నేనేంటి...?"

తనను తాను ప్రశ్నించుకున్న కిష్టయ్యకు జవాబు దొరుకలేదు.

"నేను అన్ని రకాల వ్యవసాయప్పనులు చేస్తాను... నన్నందరూ గొప్ప పనిమంతుడంటారు... నేను పంటలు పండిస్తాను... కూరగాయలు పండిస్తాను... పశువుల మేపుతాను... పాలు పిండుతాను... పాలమ్ము తాను... ఇంకా అనేక పనులు చేస్తాను... ఇదంతా పని నైపుణ్యం కాదా...?" అనాలనుకున్నాడు... కాని ధైర్యం రాలేదు...

"నా మీద కథ రాయన్నంటె నేనేం చెయ్యాలె సార్...! ఏదో మా ఊరి సారువని అట్లన్న..." అన్నాడు నవ్వుతూ.

"తానంటే ఏమనుకుంటున్నాడీ పాల మనిషి...? ఈ బక్కచిక్కిన మనిషి గురించి తానెందుకు కథ రాయాలి...? ఎంతో ఉదాత్తమైన విషయాల గూర్చి కథలు రాసే తాను కిష్టయ్య గూర్చి రాస్తాడా...? తన ముందు ఈ మనిషెంత...? ఏముంది ఇతన్ని గూర్చి రాయడానికి...? కథలు రాయడానికి కర్పూర విడములు, రాసితాందోళికలు... రమణీప్రియ దూతిక లాంటివి కోరుకునే కాలం కాకున్నా తానంతటి ఉదాత్త విషయాల గూర్చి తప్ప రాసేవాడు కాదు... తనలో తాను గొణుక్కుంటున్నడు వినూతన్... ఓ ఆంగ్ల రచయితన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి...

"మనల గూర్చి ఇతరులు రాయాలంటే రాయగలి గేంత గొప్ప పనులు చేయాలి... నువ్వేం గొప్ప పనులు చేసావని నీ గురించి రాయడం..." అన్నాడు.

"ప్రజలందరి కడుపు నింపే ఆహార పదార్థాలు పండిస్తున్న కదా సార్...! పశువుల పెంపకం కూడ చేస్తున్న... పాలు, పెరుగు, నెయ్యి, అన్నం పండించడం మంచి పనులు కావా సార్...?"

కిష్టయ్య మాటలకు ఖంగుతిన్నాడు రచయిత... ఆ మట్టి మనిషి ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టంగానే ఉంది.

అయినా ఆ కోన్‌కిస్కా రైతు ముందు ఓటమి నంగీకరించడానికి సిద్ధంగా లేడు.

"నువ్వు మట్లె బొర్లే మాదండి పని చేస్తున్నావని నీ గురించి కథ రాయాలా...? భలే వాడివున్నవు..." అని వెటకారంగా నవ్వాడు రచయిత.

"అవును సార్... నేను ఎద్దుముడ్డి పొడుసుకుంట బతికెటోన్నే... మట్టిల మట్టయి పని చేసెటోన్నే... మా ఊరి సారని అట్లడిగిన గని నా గురించి మీరెందుకు రాస్తరు సారు...? మీరు నా అసొంటోల్ల గురించి అసలే రాయద్దు... కాని మీరు తేపతేపకు నువ్వేం చేసినవని కథ రాయన్నని వెటకారం చేస్తున్నరు...? నేను మట్టి మనిషినే సార్...! ఈ మట్లె నుంచే కమ్మటి బువ్వొస్తది... కూరగాయలస్తయి... పాడి పంటలస్తయి... గీ మట్టి లేకుంటె ఏదీ లేదు సార్... అయినా సరే... మీరు మట్టి మనుషుల గురించసలే రాయద్దు... పెద్ద పెద్ద బంగ్లాలు... రంగు రంగుల బతుకులోల్ల గురించే రాయిండ్రి... మమ్ముల గురించేం రాయకుండ్రి... ఏదో తెలిసిన సారని అట్లడిగిన... గీ సంగతి మరిచిపోండ్రి సార్... నే బోతన్న."

అని గబగబా వెళ్ళిపోయాడు కిష్టయ్య... అతని ముఖం చిన్నబోవడం రచయిత దృష్టిని దాటిపోలేదు...

కిష్టయ్య మాటల ప్రభావం నుంచి తేరుకుంటానికి కొద్ది నిమిషాలు పట్టిందా రచయితకు...

'పోనియ్... పోనియ్... పోతే పోనియ్...' అనుకున్నాడు కాని ఆ మాటలను మరిచిపోవడం కష్టంగా ఉందతనికి...

తాను సైంటిఫిక్ రచనలు... టెస్ట్ ట్యూబ్ పిల్లల రచనలు... వినూత్న ప్రయోగాలతో అనేక రచనలు చేసాడు... తనలాంటి పేరున్న రచయిత ఈ కోన్‌కిస్కా గాడి గురించి రాయాల్సిన అవసరముందా? తాను మంచి పనే చేసాడు... వీళ్ళ గురించి రాయడానికే ముందని? వీళ్ళ గురించి రాస్తే తనకొచ్చేదేంటి...? పోనీ ఇతన్ని గురించి రాస్తే ఏమైనా డబ్బు లొస్తాయా...? తన రచనలు అనేక పత్రికల్లో వస్తున్నాయి... టీవీల్లో వస్తున్నాయి... సినిమాలు కూడా రాబోతున్నాయి... అలాంటి తాను కిష్టయ్య లాంటి వాళ్ళ గూర్చి రాయడమేంటి? తాను ముఖం పైనే చెప్పి మంచి పనే చేసాడు.

కుర్చీలో కొరిగి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. కొంతకాలం క్రితం తన దగ్గరకో రచయిత వచ్చాడు... సామాజిక స్పృహతోనో, మరేదో స్పృహతోనో కథలు రాస్తున్న రచయితతను... అతను రాసిన కథల పుస్తకాన్ని తనకిచ్చాడు... ఆ పుస్తకాన్ని తాను తిరగేసాడు... అందులోని పాత్రలన్నీ కూలీనాలీ జనాలు... కార్మికులు... కర్షకులు... అందులో వాడిన భాష మురికి వాడల మనుషులు మాట్లాడే భాష... ఆ పుస్తకం గూర్చి తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పేసాడు.

"ఈ వస్తువు... ఈ భాషనుపయోగించి ఇలాగే రాస్తే నువ్వు పాఠకులను చేరుకోవడం చాలా కష్టం..."

అతడు మౌనంగా తలూపాడు...

"థ్యాంక్స్ సర్..." అని వెళ్ళిపోయాడు...

పోతూ పోతూ గుంభనంగా నవ్వుకున్నట్టు జ్ఞాపకం...

అలాంటి వాడితోనే నిర్మొహమాటంగా మాట్లాడిన తాను కిష్టయ్య మాటలను పట్టించుకుంటాడా...?

అడిగితే గిడిగితే కిష్టయ్య అలాంటి వాన్ని అడగాల్సింది... తన నడగడమేంటి...? అయినా కథ రాయడానికి కిష్టయ్యలో ఏముంది...? కథ రాయాలట కథ...

లేచి నిల్చున్నాడు... భోజనం చేసి బయట కెళ్ళాడు... ఎక్కడెక్కడో తిరిగొచ్చాడు... అతని మాటలు మరిచిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు... కాని అదేమి చిత్రమో ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు.

"సారూ...! నా గురించో కథ రాయవా...! నేను మట్టి మనిషిని... అన్ని ఉత్పత్తులు చేసే సృష్టికర్తను... నా గురించో కథ రాయవా...?"

కిష్టయ్య మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి... ఇంటికి తిరిగొచ్చాడు... టేబిల్‌పై "మహాప్రస్థానం..."

"ఎవరో రచయితట- ఈ పుస్తకం ఇచ్చిపోయాడు..." అంది వినూతన్ గదిలోకొస్తూ ఆయన సతీమణి...

"సరే..." ...వెళ్ళిపోయిందామె...

సోఫాలో కూర్చొని పుస్తకం తెరిచాడు...

అగ్గిపుల్లా... సబ్బు బిళ్ళా... కుక్క పిల్లా కాదేదీ కవిత కనర్హం...

పుస్తకం తిరగేస్తున్నాడు...

అతని కళ్ళ ముందు కమ్మరి చక్రం గిరగిరా తిరుగుతుంది... మట్టి నుంచి వివిధ ఆకారాల్లో పాత్రలు తయారవుతూ బయటకొస్తున్నాయి... వల విసురుతూ జాలరి చేపలు పడుతున్న దృశ్యం కళ్ళ ముందు కదులుతుంది... కమ్మరి కొలిమిలో కర్రు సానబడుతున్నాడు... వడ్రంగి బాడిసె ధ్వని చెవులకు విందు చేస్తుంది...

సాలెల మగ్గంలో నాటె అటూ ఇటూ వేగంగా కదులుతుంది... వలపల దాపల ఎడ్ల కట్టి ఇల్లాలు విత్తనా లేస్తుంటే రైతు సాగుబాటవుతున్న దృశ్యం కళ్ళెదుట నిలుస్తుంది... సర్వ సంపదలకు సృష్టికర్తలైన వాళ్ళు అద్భుతంగా తమ కళా నైపుణ్యాన్ని చూపడం దృగ్గోచరమవుతుంది...

భోజనం చేసి పడుకున్నా అవే దృశ్యాలు... రాత్రంతా సరిగ్గా నిద్రపట్టలేదు...

ప్రొద్దున్నే లేచి కాలకృత్యాలు తీర్చుకున్నాడు... అసంపూర్తి నవల పూర్తి చేద్దామని తన గదిలో కెళ్ళాడు...

"సరోజా...! టీ పెట్టు..." కేకేసాడు.

"పాలు లేవు..." అంది సరోజ గడప దగ్గర నిల్చొని...

"ఆరు గంటలకే వచ్చేవాడు కదా కిష్టయ్య...! ఎనిమిదయింది... ఇంకా రాలేదా...?"

"ఈ రోజెందుకో రాలేదు... ఇంతసేపు రాలేదంటే ఇక రాడన్నట్టే... పాలబూతు దగ్గరికెళ్ళి ఓ పాకెట్ తెండి..." అంది సరోజ...

"ఇప్పుడంత దూరం ఎవరు పోవాలోయ్...! ఎవరైనా పాలమ్మే వాళ్ళొస్తే పిలువు..."

"ఇప్పటికే నలుగురైదుగురిని పిలిచాను... వాళ్ళ వాడుకలకే సరిపోవట... లేవన్నారు..."

"మరిప్పుడేం చెయ్యడం...?"

"మీరు పాలబూతు దగ్గరికెళ్ళి పాలు తేకుంటే రోజంతా టీ, కాఫీ ఏవీ ఉండవు... రేపు అన్నంలోకి పెరుగుండదు... కమ్మటి పెరుగు లేకుండా అన్నం తినడం మీ వల్ల కాదు గదా...!"

"కిష్టయ్యెందుకు రాలేదీ రోజు...?"

"నాకేం తెలుసు...?" అని వంట గదిలోకెళ్ళింది సరోజ...

"నిన్న అలా మాట్లాడినందుకు కావాలనే రాలేదా కిష్టయ్య...?" తనలో తానసుకోకుండా ఉండలేక పోయాడు...

విసుక్కుంటూ డ్రెస్ చేసుకున్నాడు...

రోజూ పాలమ్మే చోటికెళ్ళాడు...

"ఏంటి...? పాలు లెవ్వేంటి...?" అడిగాడక్కడున్న కుర్రాన్ని...

"ఈరోజు డైరీ కార్మికులు సమ్మె చేస్తున్నారు సార్... పాలు రాలేదు."

"సమ్మెలు. బంద్‌లు వీళ్ళకేం పన్లేదా.?" కోపంగా అన్నాడు.

"కడుపు నిండినవాళ్ళు అలాగే అంటారు సార్! కడుపు కాలిన వాళ్ళకు సమ్మెలెందుకు చేస్తారో అర్థమవుతుంది" అన్నాడా కుర్రాడు.

ఇంకేం మాట్లాడకుండా వెనుదిరిగాడు వినూతన్. పాలపొడి డబ్బా తీసుకొని ఇంటికొచ్చాడు.

"రేపటి పెరుగు గురించి చూద్దాం. ఈ పాల పొడితో టీ చెయ్యి. రేపయినా వస్తాడో రాడో కిష్టయ్య." అన్నాడు డబ్బా సరోజ చేతికిస్తూ.

"రేపు రాకుంటే ఎటు పోతాడు? ఏదో అర్జంటు పని పడి వుంటుంది. పాలు అమ్ముకోకుంటే అతనికి నష్టమే కదా."

"ఆ మాటా నిజమే."

"ఈ రోజుకయితే పెరుగుంది కదా. రేపు కిష్టయ్య రాకుంటే చూద్దాం. ఏదైనా హోటల్‌కెళ్ళి పెరుగు తెచ్చుకోవచ్చు. ఇక్కడ హోటల్లు కూడా సరిగ్గా లెవ్వు కదా?"

"సరే చూద్దాంలే."

అని తన గదిలోకెళ్ళాడు వినూతన్.

ఇలా పాలు లేని రోజులెన్నో ఉన్నా ఈ రోజెందుకో వినూతన్ ఆలోచనలన్నీ కిష్టయ్యా చుట్టే తిరుగుతున్నాయి. అతని మనస్సు కిష్టయ్య మాటల్లోని భావాల చుట్టే పరిభ్రమిస్తుంది.

తాను గ్రామంలో చూసిన వివిధ వృత్తుల వారి పని నైపుణ్యం కళ్ళ ముందు తిరగాడుతుంది.

చెప్పులు కుట్టడంలో పేరయ్య నేర్పరితనం... డప్పు కొట్టడంలో అతని కళాత్మకత... తాళ్ళు పేనడంలోని పనితనం ఎంత అద్భుతం...?

ఒడ్లు చెక్కడంలో, నాట్లెయ్యడంలో, కలుపు తీయడంలో, మోట కొట్టడంలో, పొలాలనన్నీ హలాలతో దున్నడంలో ఎంత కళుంది?

పందిర్లు వేయడంలో, ఎనుగులు (కంచెలు) నాటడంలో, పెండెలు కట్టడంలో, బంతి కొట్టడంలో ఉన్న నైపుణ్యం తక్కువయా?

బట్టలు నేయడంలో, కర్ర పని చేయడంలో, చేపలు పట్టడంలో, గొర్ల పెంపకంలో, బట్టలుతకడంలో, క్షవరం చేయడంలో ఉన్న నేర్పరితనం దేనికంటె తక్కువ?

ఇంకా... ఇంకా... సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు వినూతన్ కళ్ళ ముందు కదిలి అతన్ని మేల్కొల్పుతున్నాయి.

అద్భుత కళా నైపుణ్యం గల వీళ్ళందరిని, సర్వ

సంపదలకు సృష్టికర్తలైన వాళ్ళందరిని వదిలి తానెవరి గురించి రాస్తున్నట్టు?

ప్రశ్నలు... ప్రశ్నలు.. ప్రశ్నలు...

ఆరు రోజులు గడిచినా అతన్ని ఆలోచనలు వదలడం లేదు.

ఏ పని చేస్తున్నా అదే ఆలోచనా పరంపర.

రోజూ పాలు తెచ్చే కిష్టయ్య రాకుంటే తానెన్ని తిప్పలు పడాల్సి వస్తుంది? మరి రైతు పంటలు పండించకుంటే?

రైతు అలిగితే... భూమి అలిగితే...?

ఈ ప్రపంచం ఆకలితో అలమటించి పోదా...?

తను కూర్చున్న కుర్చీలో, పడుకున్న మంచంలో, రాసుకుంటున్న టేబుల్లో వడ్రంగి చంద్రయ్య చెమట బిందువులే కనబడుతున్నాయి.

ఇవన్నిటినీ కాదని తానింత కాలంగా రాస్తున్న దేంటి? ఎవరి గురించి రాయాలి? ఏం రాయాలి అన్న దాంట్లో తనకు స్పష్టతుందా? ఇలా అయితే నువ్వు పైకి రావని పంపించిన రచయిత రాతలను, తన రాతలను బేరీజు వేసుకుంటున్నాడు. అతనిలో అంత ర్మథనం చెలరేగుతుంది. తానెంత పని చేసాడు?

కిష్టయ్యను మట్టి మనిషని చెప్పాడు. నీ గురించి ఎందుకు రాయాలని ఎద్దేవా చేసాడు. కానీ మట్టి లేకుంటే ఈ ప్రపంచమే లేదు. ఆ మట్టి మనుషులు లేకుంటే మానవ మనుగడే లేదు.

ఇంతకాలంగా తాను ఎండమావుల వెంట తిరిగాడు.

కిష్టయ్య తన కండ్లు తెరిపించాడు... కండ్లు తెరిపించాడు. అతని కళ్ళ వెంట పటపటా నీళ్ళు కారుతున్నాయి.

"కిష్టయ్యా! ఇక ముందు నువ్వే నా కథా వస్తువు. నీ గురించే కథ రాస్తాను. నీ లాంటి వాళ్ళ గురించే రాస్తాను."

దృఢ నిర్ణయం చేసుకున్న తర్వాత కాని వినూ తన్‌కు నిద్రపట్టలేదు, హృదయంలోని బరువు తగ్గలేదు.

తెల్లవారిరి నిద్ర లేచేసరికి పాలడబ్బాతో పెద్ద దరు వాడ దగ్గర నిలుచోనున్నాడు కిష్టయ్య.

"వారం రోజులుగా ఎటు పోయావు కిష్టయ్యా!" అడిగాడు వినూతన్.

"సారూ! రొండు బర్లు ఒక్కసారే పాలు బందు జేసినయి. డాక్టరు దగ్గరికి తీసుకుపోయిన. గా తిరుగుట్లనే గిన్ని రోజులైంది."

"మరయితే రానని చెప్పొద్దా?"

"ఎట్ల జెప్పాలె సారు. నా దగ్గరేమన్న ఫోనుందా? ఇటుచ్చెటోల్లు మా ఊరోల్లెవ్వలు లేకపెయిరి."

"కిష్టయ్యా! నేనేం చేసానో తెలుసా?"

"తెలుసు సార్."

"ఏం చేసాను?"

"నా మీదో కథ రాసారు."

"ఎలా తెలుసు?"

"మీ ముఖంలున్న సంబురం చూస్తెనే తెలుస్తుంది. కని ఏం లాభం సార్? నాకు చదువు రాదు కదా!" అని వెళ్ళిపోయాడు కిష్టయ్య. ■

## నమస్కారం!

తన వీపు మీద నన్నెక్కించుకొని కాలువ దాటించిన
కడప నాపరాయికి నమస్కారం!

కాలకుండా, గుచ్చుకోకుండా కాపాడిన
కాళ్లజోడుకు చేతులు జోడింపు!

చీకటి, ఎగుడు దిగుడులలో దారి చూపించిన
వీధి దీపానికి వందనం!

అన్నీ ధరిస్తూ, అన్నిటినీ భరిస్తూ, జీవాధారమైన
ధరణికి మాతృవందనం!

పాపాన్నీ, పంకిలాన్నీ కడిగేస్తూ, ప్రాణాధారమైన
నీటికి కోటి నమస్కారాలు!

కాలుష్యాన్ని, ఎండను తనే దిగమింగి;
ప్రాణవాయువు, పత్రఫలాల్నిచ్చే
చెట్టుకు చేతులెత్తి మొక్కులు!

యాక్సిడెంటుని నివారించి, అవస్థలను తొలగించే
ట్రాఫిక్ సిగ్నల్స్‌కు సలాములు!

ముక్కు మీదెక్కి కూచున్నా, చెవులనాధారం
చేసుకున్నా, చూపునిచ్చే
కళ్లద్దాలకు కైమోడ్పులు!

ఆలోచనలకు అక్షరరూపాన్నిచ్చే పెన్నుకు
కన్నులు మూసి మనసులోనే నమః!

ఎన్నిటికి, ఎన్నెన్ని నమస్కృతులు
కృతజ్ఞతల లలిత లతానుబంధాలు
నమస్కరించడం నన్ను సంస్కరించుకోవడం
నమస్కారం మన సంస్కృతి ప్రతిరూపం!

-డా. కేతు బుచ్చిరెడ్డి